


# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

మంగళవారం | 1 | ఆగస్టు | 2023 | పేజీలు : 7




### వరద ఉధృతికి కొట్టుకుపోయిన
# విలాసాగర్ చెక్ డ్యాం

**వందలాది ఎకరాల్లో పంట నష్టం**

జమ్మికుంట, జులై 31 (మనం న్యూస్):గత వారం రోజులుగా కు రిసిన భారీ వర్షాలకు వరద ఉధృతితో మండలంలోని విలాసాగర్ చెక్ డ్యాం కొట్టుకుపోయింది. రైతుల ప్రయోజనాల కోసం నీటిని నిలువ ఉంచాలనే సంకల్పంతో, విలాసాగర్ గ్రామంలో మానేరు వాగుపై (2016)వ, సంవత్సరంలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్ చొరవతో పది కోట్ల రూపాయల వ్యయంతో చెక్ డ్యాం నిర్మించారు. ఉపరితల ద్రోని ప్రభావంతో గత వారం రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో మానేరు డ్యాం పూర్తిగా నీటితో నిండడంతో అధికారులు డ్యామ్ గేట్లను ఎత్తివేసి దిగువకు నీటిని వదిలిపెట్టారు. దీనితోపాటు కలవల ప్రాజెక్టు గండి పడటంతో వరద నీటి ఉధృతి మరింత పెరిగి, మల్లారెడ్డి పల్లె గ్రామంలోని చెరువు మత్తడి తెగిపోయి, వరదనీరు ఉధృతి కావడంతో ఆదివారం రాత్రి చెక్ డ్యాం పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో మానేరు వాగు పరివాహక ప్రాంతాల్లోని వందలాది ఎకరాలలో పంటలు పూర్తిగా కొట్టుకపోయి ఇసుక మేటలు పెట్టాయి. వరద నీటి ప్రవాహంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించిన ట్లయితే ఈ ముప్పు వాటిల్లేది,కాదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వరద ప్రవాహంతో కొట్టుకుపోయిన పంటలకు ప్రభుత్వం, అధికారులు స్పందించి రైతాంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వరద నీటితో కొట్టుకుపోయిన చెక్ డ్యామ్ ను కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిలి రమేష్ సోమవారం ఉదయం పరిశీలించారు.

---

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా
# పకడ్బందీ జాగ్రత్తలు తీసుకోవాలి

**అన్ని గ్రామాలు, విద్యా సంస్థల్లో**

**వాటర్ ట్యాంక్‌లు శుభ్రం చేయాలి**

**మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి**

**కలెక్టర్ అనురాగ్ జయంతి**



రాజన్న సిరిసిల్ల, జులై 31 (మనం న్యూస్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లో ప్రజావాణి కార్యక్రమంను పురస్కరించుకుని ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు మిగతా 2లో..

---

# పూర్తిస్థాయి ఏర్పాట్లతో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

**కలెక్టర్ హేమంత్ సహదేవరావు**

2 లో



## ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు సక్రమంగా పాటించాలి

### ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్



గోదావరిఖని, జులై 31 (మనం న్యూస్): ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను సక్రమంగా పాటించాలని, లేనిపక్షంలో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. సోమవారం గోదావరిఖనిలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఆటో యూనియన్ నాయకులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని,ఆటోకి సంబంధించిన ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఆటో ముందు భాగంలో డ్రైవర్ పక్కన ప్రయాణికులను ఎక్కించరాదని, డ్రైవింగ్ లైసెన్స్ లేనటువంటి వ్యక్తులు ఆటో నడపకూడదని తెలిపారు. మద్యం సేవించి,సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తించకూడదన్నారు.ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా చూడాలని,ప్రయాణికుల వద్ద అధిక ఛార్జీలు వసూలు చేయకూడదని పేర్కొన్నారు.ట్రాఫిక్ నియమాలను పదే పదే ఉల్లంఘించిన వారి లైసెన్సులు రద్దుకు సిఫారసు చేయడమే కాకుండా వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామగుండం కార్పొరేషన్ పరిధిలో వున్న ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ జాగ్రత్తలు తీసుకోవాలి

మొదటి పేజీ తరువాయి..



స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మంగళవారం శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. నీరు నిలిచి ఉన్న పాడుబడ్డ బావుల్లో ఆయిల్ బాల్ లు వేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పారిశుధ్య పరిస్థితినీ సెక్రెటరీ లు, క్షేత్ర అధికారులు, మహిళా సంఘాల తో సమీక్షించాలన్నారు .జిల్లాలోని అన్ని పట్టణాలు, అవాసలకు మిషన్ భగీరథ త్రాగు నీరు సరఫరా చేయాలన్నారు. కలుషితం కాకుండా సురక్షిత త్రాగునీరు సరఫరా అవుతుందో లేదో మానిటర్ చేయాలన్నారు. ఆగస్ట్ 1 న అన్ని గ్రామాలు, విద్యా సంస్థలలో వాటర్ ట్యాంక్ లనూ క్లీన్ చేయాలన్నారు. నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాల్లో నిఘా ఉంచాలన్నారు. రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం నిర్వహించనున్న డ్రై డే కార్యక్రమంలో ప్రజలు, అధికారులు అందరూ పాల్గొనాలన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసినందున మొక్కలు నాటేందుకు ఇదే సరైన సమయాన్ని కలెక్టర్ స్పష్టం చేశారు. తెలంగాణకు హరిత హరం కింద అన్ని ప్రభుత్వ శాఖలు తమకు నిర్దేశించిన ప్లాంటేషన్ లక్ష్యాలను సాధించాలన్నారు. ముఖ్యంగా ఎవేన్యూ ప్లాంటేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మేజర్ ట్రెచ్ లకు ప్రత్యేక అధికారులను నియమించాలని చెప్పారు.

మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనలో హరితహారం కార్యక్రమం ప్రగతిని కూడా సమీక్షించాలని అనురాగ్ జయంతి సూచించారు.

**: పిల్లలకు తల్లిపాలు అమృతంతో సమానం:**

పిల్లలు ఆరోగ్యంగా జీవించడానికి తల్లిపాలు అమృతంతో సమానమని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెంపొందడానికి తల్లి పాలు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బి.సత్య ప్రసాద్, ఎన్. ఖీమ్యానాయక్, వేములవాడ ఆర్డీఓ పవన్ కుమార్, జెడ్పీ సీఈవో గౌతం రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

### కలెక్టర్ హేమంత్ సహదేవరావు



కొమురంభీం ఆసిఫాబాద్, జులై 31 (మనం న్యూస్): జిల్లాలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవ రావు అన్నారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాల నిర్వహణపై మహిళ సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యాధికారులు, సిబ్బంది సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో వారోత్సవాలను విజయవంతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు, ఆశ కార్యకర్తలతో గ్రామాలలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సంక్షేమ శాఖ సిడిపిఓలు, సూపర్ వైజర్లు తమ క్లస్టర్ పరిధిలో అంగన్వాడి సిబ్బందితో సమావేశాలు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. మండలాల వారీగా సమావేశం నిర్వహించి వైద్య సిబ్బంది భాగస్వామ్యంతో తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి మణెమ్మ, జిల్లా పరిషత్ సిఈఓ రత్నమాల, ప్రాజెక్టు అధికారులు, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పూర్తిస్థాయి ఏర్పాట్లతో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

### కలెక్టర్ హేమంత్ సహదేవరావు



కొమురంభీం ఆసిఫాబాద్, జులై 31 (మనం న్యూస్): జిల్లా వ్యాప్తంగా పూర్తిస్థాయి ఏర్పాట్లతో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా ఎస్ పి సురేష్ కుమార్ తో కలిసి సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజక వర్గాలలోని సెక్టార్ అధికారులు, పోలీస్ అధికారులతో వచ్చే సాధారణ శాసన సభ ఎన్నికలకు జిల్లాలు చేపట్టవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పూర్తిస్థాయి ఏర్పాట్లతో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. సెక్టార్ జోనల్ అధికారులుగా నియమించబడే అధికారులు తమ సెక్టార్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి చేపట్టవలసిన పనులను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో 584 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 78 రూట్లను ఏర్పాటు చేసి 78 మంది రూట్ అధికారులను నియమించడం జరిగిందని, అధికారులు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి నెలకొన్న సమస్యలను గుర్తించి నివేదిక అందించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అచ్చేశ్వరరావు, ఆర్ డి ఓ రాజేశ్వర్, సి ఐ లు, ఎస్ ఐ లు, తహసిల్దార్లు, జోనల్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వర్షాలతో నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి




ఇల్లందకుంట, జులై 31 (మనం న్యూస్): వారం రోజులపాటు కురిసిన భారీ వర్షాల మూలంగా జిల్లాలో పెద్ద ఎత్తున పంట నష్టం తో పాటు ఇండ్లు కూలిపోయాయని వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాధారణ వర్షపాతం కంటే అధిక వర్ష పాతంతో పాటు లోయర్ మానేరు డాం గేట్లు ఎత్తివేయడం, కలవాల ప్రాజెక్టు తెగిపోవడం కొన్ని చెరువుల మత్తడులు తెగిపోవడం మూలంగా తీవ్ర నష్టం జరిగిందన్నారు. వీటితో పాటుగా మానేరు నది ప్రవాహం అధికం కావడం వలన నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన చెక్ డ్యాములు కొట్టుకపోయి వేలాది ఎకరాల్లో పంటలకు ఇసుకమేటలు పెట్టాయన్నారు. ఇసుక మేటలు పెట్టిన ప్రాంతాలను రెవెన్యూ అధికారులు సర్వే చేసి రైతులకు హద్దులు నిర్ణయించి పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి 30 వేల రూపాయల పరిహారం చెల్లించాలని వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ఇండ్లు కూలిపోయిన వారిని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకుని, గృహలక్ష్మి పథకం కింద వెంటనే ఇండ్లు మంజూరు చేయాలన్నారు. వేసిన పంటలు అధిక వర్షాలతో కొట్టుకుపోయాయని వరి వేసిన రైతులకు పెద్ద ఎత్తున నష్టం జరిగింది అన్నారు. ఎకరానికి 30 వేల రూపాయల నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరదల కారణంగా తెగిన చెరువుగట్లను చెక్ డ్యాములను వెంటనే పునర్ నిర్మించాలని, రహదారులను వెంటనే మరమ్మతులు చేయాలని, పకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన సమయంలో పంటల బీమా పథకాన్ని అమలు చేసి ఉంటే కొంత రైతులకు ఉపశమనం దక్కేదన్నారు. ఇప్పటికైనా సర్వే నెంబర్ యూనిట్ గా తీసుకొని పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి శీలం అశోక్, రాము, దొండి సతీష్, కిషోర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# కోరుట్ల పురపాలక సంఘ సమావేశం

### పలు అభివృద్ధి పనులకు సభ్యుల ఆమోదం



కోరుట్ల, జులై 31 (మనం న్యూస్ ): కోరుట్ల పురపాలక సంఘ కార్యాలయంలో చైర్ పర్సన్ అన్నం లావణ్య అధ్యక్షతన సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో 40 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యా సాగర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశం లో మొక్కలకు డ్రిప్ పద్ధతి ద్వారా నీటిని పోయుటకు 30 లక్షలు, సెంట్రల్ లైటింగ్ నిర్వహణకు 2 లక్షలు, 3వ వార్డ్ లో వాగు వద్ద గల మహాలక్ష్మి గుడికి పోయే దారిలో కల్వర్టు నిర్మించుటకు 5 లక్షలు, హరిత హరం కార్యక్రమ నిర్వహణకు 12 లక్షల ముప్పై వేలు, మురికి కాలువల నుండి మురికి నీరు మద్దుల చెరువులో చేరకుండా కచ్చా కాలువ ఏర్పాటుకు 5 లక్షలు, వర్షాల వలన రోడ్ల లో ఏర్పడిన గుంతలలో మొరం పోయుటకు 5 లక్షలు, 24 ,26, 27, 30 వ వార్డ్ లలో కల్వర్టు లు నిర్మించేందుకు 5 లక్షల రూపాయలు అందించేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. అదే విధంగా ఎస్బీఎమ్ నిధులు లక్షా 33 వేల రూపాయలతో స్లాటర్ హౌస్ వద్ద పూర్తి సదుపాయాల కల్పనకు కలెక్టర్ ఆమోదం కొరకు పంపుటకు, యకిన్పూర్ లో ఎస్సారెస్పీ కెనాల్ పక్కన మట్టి రోడ్డు ఫార్మేషన్ చేయుటకు రూ'1 లక్ష రూపాయలు, ముత్యాల వాడ వద్ద వర్షపు నీరు మళ్లించుటకు తొలగించిన డివైడర్ ను తిరిగి నిర్మించుటకు రూ'1 లక్ష రూపాయలు, భారీ వర్షాలకు సాయిరాంపుర కాలనీలో గల హిందూ స్మశాన వాటిక కాంపౌండ్ వాల్, ఫ్లోరింగ్, బర్నింగ్ ప్లాట్ ఫామ్, తదితర ఏర్పాట్లను తిరిగి నిర్మించుటకు రూ '30 లక్షలు మొదలగు పలు అభివృద్ధి పనులకు సమావేశం ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ గడ్డమీద పవన్, మున్సిపల్ కమిషనర్ అయాజ్ , డివైఈఈ అభినయ్, ఏఈ లక్ష్మి , టీపీఓ ప్రవీణ్, శివ, మేనేజర్ శ్రీనివాస్, అర్ ఓ తిరుపతి, శానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, వార్డ్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ - సభ్యులు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## మున్సిపల్ అత్యవసర సమావేశం



రాజన్న సిరిసిల్ల, జులై 31 (మనం న్యూస్): సిరిసిల్ల పురపాలక సంఘ కార్యాలయంలో చైర్ పర్సన్ జిందం కళ అధ్యక్షతన సోమవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళ మా ట్లాడుతూ గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పట్టణం లో లోతట్టు ప్రాంతాలకు వరదలు వచ్చి ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. భవిష్యత్‌లో కురిసే భారీ వర్షాల దృష్ట్యా ముందస్తు చర్యలను చేపట్టేందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేయడానికి పాలకవర్గ సభ్యులతో మాట్లాడి తగు నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. వారం రోజులపాటు భారీగా కురిసిన వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలకు వరదల వచ్చే విషయం అందరికీ తెలిసిందేనని, అందువల్ల పలుచోట్ల మట్టి రోడ్లు చెడిపోవడం, రోడ్లపై బురద పేరుకుపోవడం, మొదలగు శానిటేషన్ సమస్యలు తలెత్తగా, పాలకవర్గ సభ్యులతో చర్చించి, నిధులను కేటాయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వైస్ చైర్మన్ మంచి శ్రీనివాస్, కౌన్సిలర్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాలకు కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

### ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు



మంచిర్యాల, జులై 31 (మనం న్యూస్): ఎలాంటి గుర్తింపు లేకుండా కొనసాగుతోన్న నారాయణ పాఠశాలకు కొమ్ముకాస్తున్న విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పాలనాధికారి కార్యాలయంలో ఏవో సురేష్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ నారాయణ పాఠశాలకు ఎలాంటి గుర్తింపు లేకుండా నడుస్తున్నప్పటికీ సంబంధిత విద్యాశాఖాధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. నారాయణ పాఠశాలకు ఎలాంటి గ్రౌండ్, ఫైర్ సేఫ్టీ లేకుండా ప్రీ ప్రైమరీ కి అనుమతులు లేకుండా వారికి ఇష్టం వచ్చినట్టుగా పాఠశాల నడిపిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు వాహనాలలో విద్యార్థులను తరలిస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతోన్న ఈ పాఠశాల తీరును అధికారుల దృష్టికి తీసుకెళ్లి నారాయణ పాఠశాలను సీజ్ చేయాలని కోరినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకొని నారాయణ పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సల్మాన్, తెలంగాణ విద్యార్థి సమైక్య జిల్లా అధ్యక్షుడు రేగుంట క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



శంకరపట్నం, జులై 31 (మనం న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా అందిస్తోన్న నోట్ పుస్తకాలను కన్నాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ కాటం వెంకటరమణా రెడ్డి చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు మోతే భాగ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు రాపెల్లి శ్రీనివాస్, ఉపసర్పంచ్ కుమార్, ఎస్ఎంసి చైర్మన్ శ్రీనివాస్, ఎస్ఎంసి వైస్ చైర్ పర్సన్ శారద, కో-ఆప్షన్ సభ్యులు సదానందం, ఎస్ఎంసి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఎల్ఐసి ఏజంట్ల ఫెడరేషన్ నూతన కార్యవర్గం

కరీంనగర్, జులై 31 (మనం న్యూస్): ఎల్ఐసి ఏజంట్ల ఫెడరేషన్ కరీంనగర్ బ్రాంచి వన్ ఎన్నికలు నగరంలోని పిఎమ్ కన్వెన్షన్ లో సోమవారం నిర్వహించారు. పోటాపోటీగా జరిగిన ఎన్నికల్లో ఫెడరేషన్ అధ్యక్షులుగా తాడికొండ శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా కట్ట శ్రీనివాస్, కోశాధికారిగా కోటగిరి రవీందర్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా లియాఫీ కరీంనగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు గట్టు రాజయ్య, పెంచాల రంగారావు, కోశాధికారి గంధం వెంకటేశ్వర్లు, ఆలిండియా యాక్షన్ కమిటీ చైర్మన్ బోయినపల్లి ప్రభాకర్ రావులు నూతనంగా ఎన్నికైన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ డివిజన్ పరిధిలోని వివిధ బ్రాంచిల లియాఫీ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు



కరీంనగర్, జులై 31 (మనం న్యూస్): నూతన కలెక్టర్ డాక్టర్ బి.గోపిని సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పి కేశవరెడ్డి , రాష్ట్ర పాలకమండలి సభ్యులు శ్రీనివాస రావు, ట్రెజరర్ పోరెడ్డి శ్రీహరి రెడ్డి , సెక్రటరీ ఉట్కూరి రాధాకృష్ణ రెడ్డి, సభ్యులు ఇంజనీర్ కోల అన్నారెడ్డి, వరంగల్ ఎంసీ మెంబర్ ఎన్.శాంతి కుమార్‌లు కలిసి పుష్పగుచ్ఛం, మెమోంటోలు అందించి అభినందించారు.

## పాత్రికేయుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



మెట్ పల్లి, జులై 31 (మన న్యూస్): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన సీనియర్ రిపోర్టర్ గుండేటి కిరణ్ కుమార్ గత 15 రోజుల క్రితం గుండె పోటు తో మరణించగా సోమవారం ఆయన కుటుంబ సభ్యులను తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఐజే యూ) మెట్ పల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు దాసం కిషన్ మాట్లాడుతూ జర్నలిస్ట్ లను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. జర్నలిస్ట్‌లు మరణిస్తే వారి కుటుంబానికి ప్రభుత్వం తరుపున 10 లక్షల రూపాయల పోస్టల్ ఇన్సూరెన్స్ పాలసీ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్ర శేఖర్, టీయూడబ్ల్యూజే హెచ్ 143 జగిత్యాల జిల్లా అధ్యక్షుడు శికారి రామకృష్ణ, మెట్పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా అధ్యక్షుడు ఆగ సురేష్, ప్రధాన కార్యదర్శి మ్యాకల శివ, ఉపాధ్యక్షుడు మహమ్మద్ అజీమ్, సంయుక్త కార్యదర్శులు జంగం విజయ్, తరి రాజశేఖర్, షేక్ సాజిత్. మసూద్, మోసిన్, కోరుట్ల పాత్రికేయులు ముబీన్ తదితరులు పాల్గొన్నారు.

# 2వ తేదీ నుంచి రామంచలో ఉర్సు ఉత్సవాలు



చిగురుమామిడి, జులై 31 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రామంచలో షా అబ్దుల్ రెహ మాన్ జంగే షాహిద్ దర్గా సందల్ ఉత్సవాలు ఆగస్టు 2వ తేదీ నుంచి నుండి ఘనంగా ప్రారంభం అవుతున్నట్లు దర్గా నిర్వాకుడు మహమ్మద్ కరీం ఖాన్ తెలిపారు.జిల్లాలోనే రెండో అతిపెద్దదిగా పేరున్న ఈ దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా విద్యుత్ కాంతులతో అందంగా ముస్తాబు చేసినట్లు చెప్పారు. దర్గాలో 2న రాత్రి నుంచి 3వ తేదీ వేకువజాము వరకు ప్రత్యేక ప్రార్ధనలు కొనసాగుతాయని చెప్పారు.వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులు కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సందల్ ఊరేగింపులో పాల్గొని దర్గాలో మొక్కలు తీర్చుకోవాలని కోరారు.

### దర్గా నేపథ్యం..

దాదాపు 300 ఏళ్ల క్రితం ఇస్లాం మత గురువు షా అబ్దుల్ రెహామాన్ ఈ ప్రాంతానికి వచ్చాడనీ,రామంచతో పాటు ఇతర గ్రామాల్లో తిరుగుతూ మత ప్రచారం చేస్తూ ఇక్కడే చనిపోయా డనీ, అప్పటి రామంచ గ్రామ పోలీస్ పటేల్ నర్ర గోపాల్ రెడ్డి తన పొలం నుంచి వ్యవసాయ పనులు చూసుకొని ఇంటికి వస్తుండగా ఒక చోట వెలుతురు కనిపించిందనీ, అదే చోట గోపాల్రెడ్డి దర్గాను నిర్మించారని గ్రామస్తులు చెబుతుంటారు.అతని కుటుంబీకులు నర్ర వెంకట్రెడ్డి, అతడి కుమారుడు నర్ర గోపాల్రెడ్డి, నిర్వాహకుడు సయ్యద్ కరీంఖాన్ ఆధ్వర్యంలో ఏటా ఉర్సు ఘనంగా జరుపుతున్నట్లు పేర్కొన్నారు.ఈ ఉత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా మహారాష్ట్ర, హైదరాబాద్ ఇతర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారని గ్రామస్తులు తెలిపారు.భక్తుల కోసం నిర్వాహకులతో పాటు సర్పంచ్ అధ్వర్యంలో సౌకర్యాలు కల్పించనున్నారు.

### గ్రామస్తుల సహకారంతో ఏటా నిర్వహిస్తున్నా...

### : దర్గా నిర్వాహకుడు కరీం ఖాన్



ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దర్గ వద్ద మట్టి కొట్టుకుపోయిందని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్ దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించారని దర్గా నిర్వాహకుడు తెలిపారు. రామంచ దర్గాలో ఏటా రెండు రోజులు గ్రామస్తుల సాయంతో ఉర్సు నిర్వహిస్తున్నామని,వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా వస్తారన్నారు.వారికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, గ్రామస్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు తెలిపారు.

### సర్పంచ్ ఏకపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ..

# ఎనిమిది మంది వార్డు సభ్యుల రాజీనామా



చిగురుమామిడి, జులై 31 (మనం న్యూస్): మండలంలోని ఉల్లంపల్లి గ్రామాన్ని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో విలీనం చేయాలని కోరుతూ సర్పంచ్ చిట్యాల మమత స్థానిక శాసనసభ్యులు సతీష్‌కుమార్‌కు ఏకపక్షంగా లేఖ అందించారని నిరసిస్తూ ఎనిమిది మంది గ్రామ వార్డు సభ్యులు సోమవారం తమ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను కలెక్టర్‌తో పాటు జిల్లా పంచాయితీ అధికారికి పంపించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వార్డు సభ్యులు, గ్రామ ప్రజల అభిప్రాయం తీసుకోకుండా, ఎలాంటి ముందస్తు సమాచారం అందించకుండా సొంత అభిప్రాయం మేరకే గ్రామాన్ని హుస్నాబాద్ మండలంలో కలపాలని ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే తామంతా రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు చర్చించి యధావిధిగా చిగురుమామిడి మండలంలోనే తమ గ్రామం కొనసాగేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

# పునరావాస కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం విఫలం

### నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి

### టిడిపి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి



కరీంనగర్, జులై 31 (మనం న్యూస్): భారీ వర్షాల కారణంగా వరద విపత్తు పొంచి ఉందని వాతావరణ కేంద్రాలు హెచ్చరించినా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని తెలుగుదేశం పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు వంచ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యంలు విమర్శించారు. సోమవారం వారు పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రమంతటా వర్షాలు ముంచెత్తుతున్న పలుచోట్ల వరంగల్ లాంటి నగరాలు జలమయమై, లోతట్టు ప్రాంతాలు మునిగి రోడ్లు తెగి రాకపోకలకు అంతరాయం ఏర్పడినా, ప్రాణనష్టం జరిగినా ముఖ్యమంత్రి కనీసం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. వరద ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలోనూ మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, పూర్తిగా విఫలమయ్యారని, అందుకు ముఖ్యమంత్రితో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పి చెంపలు వేసుకోవాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో వంట నష్టపోయిన రైతులను, ఆస్తి నష్టపోయిన ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఓటమి ఖాయమని పేర్కొన్నారు. చంద్రబాబు పేరు ఎత్తనిది బిఆర్ఎస్ నాయకులకు పూట గడవదని, చంద్రబాబు పేరు అనగానే మంత్రులకు, నాయకులకు వణుకు పుడుతుందన్నారు. ఇది ముమ్మాటికీ అసమర్థత బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని, దీనిపై ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. వర్షాలకు ఇళ్లు కోల్పోయిన వారికి ఆశ్రయం కల్పించేందుకు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని శ్రీనివాస్ రెడ్డి,దామెర సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాల వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదమున్న నేపథ్యంలో వెంటనే గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలను ఆదుకోవాలని కోరారు.

# షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు



కొమురంభీం ఆసిఫాబాద్, జులై 31 (మనం న్యూస్): వాంకిడి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు షీటీం ఆధ్వర్యంలో సమాజంలో జరుగుతోన్న వివిధ నేరాలు, వాటి నుంచి రక్షణ అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఇంచార్జి సునీత మాట్లాడుతూ హింస, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ లకు ఎవరైనా గురి అయినట్లయితే షీ టీమ్ ను సంప్రదించాలని సూచించారు . సైబర్ క్రైమ్ కు గురి అయితే 1930 కాల్ చేయాలని, అపరిచిత వ్యక్తులకు ఫోన్ నెంబర్లు ఇవ్వకూడదని పేర్కొన్నారు. ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100 కు గానీ, ఆసిఫాబాద్ షీ టీం నంబరు 87126 70564 లో గానీ సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆసిఫాబాద్ షి టీం సభ్యులు శ్రీలత, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్ష బాధితులను ఆదుకోవాలి

### ఎమ్మెల్యేకు బిజెపి నాయకుల వినతి పత్రం



కోరుట్ల, జులై 31 (మనం న్యూస్): నిరాటంకంగా కురిసిన వర్షాల కారణంగా నష్టపోయిన వారిని తక్షణమే ఆదుకోవాలని కోరుతూ బిజెపి పట్టణ అధ్యక్షుడు దాసరి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ స్థానిక 10, 11 వార్డుల్లో అకాలవర్షం కారణంగా చెడిపోయిన రోడ్లు, మురికి కాల్వలను బాగు చేయాలని, నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వపరంగా పరిహారం అందించాలని, గోడకూలి చనిపోయిన బొచుకారి రజిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పెండెం గణేష్, బిజెపి సీనియర్ నాయకులు పీసరి నర్సయ్య, జిల్లా అధికార ప్రతినిధి ఇందూరి తిరుమలవాసు, ప్రధాన కార్యదర్శులు పోతుగంటి శ్రీనివాస్, మొలుమూరి రాజమురళి, సుదవేని మహేష్ , బిజెవైఎం పట్టణ అధ్యక్షుడు కలాల సాయిచందు, నాయకులు గుండేటి సాయికుమార్, మరిపెల్లి నవీన్, వాసాల నవీన్, గుజ్జేటి రాజేందర్, కసుల వంశీ, గోనెల రాజశేకర్, వార్డు ప్రజలు పాల్గొన్నారు

# కెసిఆర్, కెటిఆర్ చిత్ర పటాలకు పిండ ప్రదానం

ఇల్లంతకుంట, జులై 31 (మనం న్యూస్): పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కాంగ్రెస్ కమిటి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కెటిఆర్‌ల చిత్రపటాలకు మండల కేంద్రంలో పిండ ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు అంతగిరి వినయ్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రాంతాల్లో పంటలు నష్టపోయి రైతన్నలు విలపిస్తుంటే స్థానిక శాసనసభ్యుడు ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నష్టపోయిన వారందరికీ పరిహారాన్ని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పసుల వెంకటి, అంతగిరి బాలపోచయ్య, మైనార్టీ విభాగం అధ్యక్షులు జమాల్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎర్రోజు సంతోష్, పట్టణ అధ్యక్షుడు మామిడి నరేష్, నాయకులు అన్నాడి సంపత్ రెడ్డి, దూస రాజు,



కోటేశ్వర్, రాజేంద్రా, కాసుపాక రమేష్, న్యాత బాబు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట వద్దు.. కరీంనగర్ ముద్దు..

**తమ గ్రామాన్ని కరీంనగర్ జిల్లాలోనే**
**ఉంచాలని ఉల్లంపల్లి వాసుల నిరసన**
**ఉప సర్పంచ్, వార్డు సభ్యులను నిర్బంధించిన గ్రామస్తులు**

చిగురుమామిడి, జులై 31 (మనం న్యూస్): తమ గ్రామాన్ని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల పరిధిలోని ఉంచాలని డిమాండ్ చేస్తూ ఉల్లంపల్లి గ్రామస్తులు సోమవారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించిన గ్రామస్తులు, స్థానిక ఉప సర్పంచ్, వార్డు సభ్యులను గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్బంధించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ ఉల్లంపల్లి గ్రామాన్ని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలో విలీనం





చేయకూడదని, యథావిధిగా కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం చిగురుమామిడి తహసిల్దార్ జింకల జయంత్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాన్ని చిగురుమామిడి మండల పరిధిలోనే ఉంచేలా పాటుపడాలని, లేని పక్షంలో గ్రామంలో భారీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బిజెపి, సిపిఐ, బిఆర్ఎస్, పార్టీల నాయకులు మాజీ సర్పంచ్ కొమ్ము సమ్మయ్య, రాగుల కొమురయ్య, కొత్తపల్లి సత్యనారాయణ, పోలోజు వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు సుధగోని రాజేంద్రప్రసాద్, సయ్యద్ హుస్సేన్ నాబి, షరీఫ్, కోల జీవిత ప్రసాద్, కాశవేణి స్వరూప, నారాయణ, కాశవేణి వీరవ్వ, రాగుల రవీందర్, పత్తెం తిరుపతి, కోల సాయిలు, భోనాద్రి సాయిలు, సాగర్, జనవేని అజయ్, అంబేద్కర్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు జేరిపోతుల శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలను పరామర్శించిన చాడ వెంకటరెడ్డి



చిగురుమామిడి, జులై 31 (మనం న్యూస్): చిగురుమామిడి మండలంలోని నవాబుపేట, సుందరగిరి, చిగురుమామిడి, గాగిరెడ్డిపల్లె, రేకొండ గ్రామాలకు చెందిన పలువురు ఇటీవల మరణించగా, వారి కుటుంబ సభ్యులను సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి సోమవారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవాబుపేట గ్రామానికి చెందిన ఏడెల్లి రాజయ్య అనే రైతు ప్రమాదవశాత్తు వాగులో కొట్టుకపోయి మృతి చెందడం బాధాకరమని, ఆ కుటుంబం ఉండడానికి ఇల్లు సరిగా లేని పరిస్థితి నెలకొందన్నారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణమే 10 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, గృహలక్ష్మి పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో సిపిఐ చిగురుమామిడి మండల కార్యదర్శి నాగేల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ జడ్పిటిసి సభ్యులు అందె స్వామి, మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు గూడెం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## అడిషనల్ డిసిపిగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీనారాయణ



కరీంనగర్ క్రైం, జులై 31 (మనం న్యూస్): కరీంనగర్ కమిషనరేట్ శాంతి భద్రతల అదనపు డిసిపిగా ఎ.లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డిఎస్పీ గా హైదరాబాద్ సిఐడి విభాగంలో పనిచేసిన ఆయన పదోన్నతిపై కరీంనగర్‌కు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ సుబ్బరాయుడును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

: ట్రాఫిక్ ఏసిపి గా సర్వర్ బాధ్యతలు స్వీకరణ :

కరీంనగర్ ట్రాఫిక్ విభాగం ఏసిపిగా సర్వర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. 1995 బ్యాచ్ కు చెందిన ఆయన కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. ట్రాఫిక్ ఏసిపి గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన సిపి సుబ్బరాయుడును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

## కెసిఆర్, కెటిఆర్‌లకు పిండ ప్రదానం చేసిన కాంగ్రెస్ నాయకులు



తిమ్మాపూర్, జులై31 (మనం న్యూస్): రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కెసిఆర్, కెటిఆర్‌లకు పిండ ప్రదానం చేసి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం డిసిసి అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండలం పోలంపల్లి గ్రామంలో కొట్టుకు పోయిన లో లెవల్ బ్రిడ్జి వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి పిండ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల అనేక గ్రామాల్లో రోడ్లు, లో లెవల్ బ్రిడ్జిలు కొట్టుకుపోయి, చెరువులు తెగిపోయి, పంట పొలాల్లో ఇసుక మేటలు వేసి రైతులు నష్టపోయినా ఇప్పటి వరకు స్థానిక ఎమ్మెల్యే గానీ అధికారులు గానీ కనీసం క్షేత్రస్థాయి పరిశీలన చేయలేదన్నారు. గత పదేళ్ళుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సమ స్యలను పట్టించుకోవడం లేదని, వర్షాల వల్ల నియోజకవ ర్గంలో అనేక గ్రామాలకు రాకపోకలు నిల్చిపోయాయని సరైన రోడ్డు మార్గాలు బ్రిడ్జిలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పోలంపల్లి, మొగిలి పాలెం గ్రామాల బ్రిడ్జి మంజూరు అయినా టెండర్లు కాక పనులు చేయడంలేదని తెలిపారు. ప్రజా సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యేకు రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ది చెబుతారని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపల్లి రమణా రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఎల్కపల్లి సంపత్, పోలంపల్లి ఎంపిటిసి సభ్యులు బండారి రమేష్, మాజీ సర్పంచ్ బుడిగే కొండయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు చేన్నబోయిన రవి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు రెడ్డిగాని రాజు, గ్రామశాఖ అధ్యక్షులు గుంటి మల్లేష్, కాంగ్రెస్ నాయకులు కనకం కొమురయ్య, మహ్మద్ ఆశిక్ పాషా, బుడిగే సంపత్, గుంటి బిరయ్య, పడల శ్రీనివాస్, అనిల్, హరీష్, షబ్బీర్, యాకుబ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంపు డిఐఇవో శ్రీధర్ సుమన్



కొమురంభీం ఆసిఫాబాద్, జులై 31 (మనం న్యూస్): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ రంగ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు చేరటానికి అడ్మిషన్ల గడువును ఆగస్టు 5 వ తేదీ వరకు పెంచినట్లు జిల్లా మాధ్యమిక విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ కళాశాలలో విద్యార్థులు మొదటి సంవత్సరం అడ్మిషన్ చేరటానికి జూలై 31 వరకు మాత్రమే గడువు విధించామని, వరుసగా కురిసిన భారీ వర్షాల కారణంగా విద్యార్థుల సౌలభ్యం కొరకు ఈ గడువును ఆగస్టు 5 వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. రెగ్యులర్ ఇంటర్ అడ్మిషన్లకు టిసి తప్పనిసరని స్పష్టం చేసారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ ఆదేశానుసారం ప్రైవేటు జూనియర్ కళాశాలలో అడ్మిషన్ పొందగోరే విద్యార్థులు గడువు తేదీ ముగిసిన తర్వాత ఆగస్టు 6 నుండి 16 వ తేదీ వరకు ఐదు వందల రూపాయల అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## కలెక్టరేట్‌ను ముట్టడించిన

# గ్రామపంచాయితీ కార్మికులు

సిరిసిల్ల టౌన్, జులై 31 (మనం న్యూస్): తమ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం గ్రామపంచాయతీ కార్మికులు కలెక్టరేట్ ను ముట్టడించారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై వినతి పత్రం కలెక్టర్ అనురాగ్ జయంతి తీసుకోవడానికి రాకపోవడంతో కార్మికులందరూ పెద్ద ఎత్తున గేట్లు తోసుకుంటూ లోపలికి వెళ్లేందుకు యత్నించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కార్మికుల వద్దకు రావడంతో వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా జిల్లాలో సమ్మె విచ్ఛిన్నం చేయడానికి పోటీ కార్మికులను పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ







సమావేశంలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలు గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని లేని పక్షంలో అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణ, జిల్లా సహాయ కార్యదర్శి మోర అజయ్ , వీర్నపల్లి ఎంపిటిసి సభ్యులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లారపు అరుణ్ కుమార్, గురజాల శ్రీధర్, ముక్తిమంత అశోక్, గ్రామపంచాయతీ యూనియన్ అధ్యక్షులు మల్యాల నరసయ్య, సూరం పద్మ , శ్రీరాం సదానందం, గాజుల రూప, బెజిగం సురేష్ , లింగంపల్లి కృష్ణవేణి , బుర శ్రీనివాస్, రవి, జెల్లి లక్ష్మణ్, మల్లయ్య, రాజయ్య, సాదుల్ల, రవి, లక్ష్మణ్, రాజేశం, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**- హాజరు శాతం తక్కువ ఉన్న విద్యార్థులకు విద్యపట్ల ఆసక్తి మెరుగుపర్చాలి**

**- నిబంధనల ప్రకారం పేరెంట్, టీచర్ మీటింగ్స్ నిర్వహించాలి**

**- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



పెద్దపల్లి, జూలై 31 (మనం ప్రతినిధి) : పాఠశాలలోని ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యాబోధన జరపాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.పెద్దపల్లి లోని ప్రగతినగర్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య అంశాలకు సంబంధించి పలు ప్రశ్నలను అడిగి విద్యార్థులు ఇచ్చిన సమాదానాలు,చదివే,రాసే సామర్థ్యం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి వారి తల్లిదండ్రులతో చర్చించి పాఠశాలకు రెగ్యులర్‌గా వచ్చే పేరెంట్, టీచర్స్ మీటింగ్ పకడ్బందీగా నిర్వహించాలని,విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించి వారి విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే దిశగా కృషి చేయాలని కలెక్టర్ కోరారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన లైబ్రరీ రూమ్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతిరోజు విద్యార్థులు కనీసం గంట సమయం గ్రంథాలయంలో గడపాలని,విద్యార్థులు చదవడం అలవర్చుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రమాదేవి, టీచర్స్ అనిత,రమ్య,తదితరులు పాల్గొన్నారు.






# నిజామాబాద్



## వరద బాధితులు, రైతుల పట్ల చిన్నచూపా..?

### మంత్రి, ఎంపి, ఎమ్మెల్యేలకు సోయిలేదు

### డిసిసి అధ్యక్షులు మోహన్‌రెడ్డి

నిజామాబాద్, జులై 31 (మనం న్యూస్): నిరాటంకంగా కురిసిన భారీ వర్షాల వరద బాధితులకు తక్షణమే నష్టపరిహారాన్ని అందించడంలో ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. తక్షణమే వరద బాధితులను ఆదుకునే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయం కాంగ్రెస్ భవన్‌లో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణుతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షానికి నష్టపోయిన వరద బాధితులకు రైతులకు ఆదుకోవాల్సిన ఎంపి ధర్మపురి అరవింద్‌కు, జిల్లా మంత్రి ఎమ్మెల్యేలకు వరద బాధితులకు నష్ట పరిహారాన్ని అందించి ఆర్థికంగా ఆదుకోవాలనే సోయిలేదని మండిపడ్డారు. జిల్లాలో భారీ వర్షాలకు అధిక ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇలాంటి నష్టాలకు ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా ఆర్థిక సహాయం వచ్చిందని, కానీ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎనిమిది సంవత్సరాలుగా వరదలతో ప్రజలు నష్టపోతుంటే ఆర్థిక సహాయం అందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామర్తి గోపి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్ ,జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, జిల్లా సేవదల్ అధ్యక్షులు సంతోష్ ,రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి పద్మ, ఎన్ ఎస్ యు ఐ నాయకులు అఖిల్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పారిశుధ్య కార్మికుని మృతి



ఆర్మూర్ జులై 31 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆర్మూర్ మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు చిట్యాల రాజేష్ (29) చికిత్స పొందుతూ మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ ఆయనను నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించారు. అతనికి భార్య, ముగ్గురు కుమారులున్నారు.

## వాటర్ ఫాల్స్, డ్యామ్, పర్యాటక ప్రాంతాల్లోకి అనుమతి లేదు

### ఎస్ఐ సాగర్

కొమురంభీం ఆసిఫాబాద్, జులై 31 (మనం న్యూస్): గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన ప్రాజెక్ట్ లు, డ్యామ్స్ చెరువులు, వాగులు నిండుగా ఉన్న నేపథ్యంలో వాంకిడి మండలం లోని సర్కెపల్లి బుగ్గ జలపాతం, అడ ప్రాజెక్టుల వద్దకు ప్రజలు వెళ్లేందుకు అనుమతి లేదని వాంకిడి ఎస్సై సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు, యువత పోలీసుల సూచనలు పాటిస్తూ, సహకరించాలని పేర్కొన్నారు. వాంకిడి పోలీస్ యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే 87126 70531, 87126 70509 నంబర్లలో గానీ డయల్ 100కు గానీ ఫోన్ సంప్రదించాలని సూచించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు ఫుల్..

# సౌకర్యాలు నిల్..

- విభాగాల్లో వైద్యుల కరవు

-ఎస్సార్, మెడికో విద్యార్థుల పైనే భారం

- రెగ్యులర్ వైద్యులు, పాలనాధికారులు, సిబ్బంది లేమి

-కాగితాలకే పరిమితమవుతున్న సలహాలు, సూచనలు.

-అంతా చేసేది అవుట్ సోర్సింగ్ ఉద్యోగస్తులే

- రోగులకు తప్పని తిప్పలు




నిజామాబాద్ ప్రతినిధి, జులై 31 (మనం న్యూస్): ఆధునిక హంగులతో ఏడు అంతస్తుల భవనంలో నిర్మించిన నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దానికి తగ్గట్టుగా వసతులు కరవయ్యాయి. ఈ ఆస్పత్రికి నిత్యం వస్తోన్న రోగులకు సరిపడా వైద్యులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులేర్పడుతున్నాయి. జాతీయ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలకు అనుగుణంగా ఏడవ అంతస్తుల వరకు అన్ని విభాగాలలో అనాటమి, ఫిజియాలజీ ,మైక్రో బయాలజీ , బయో కెమిస్ట్రీ , క్లినికల్ పాథలాజి వంటి విభాగాలతో పాటు , సివిల్ సర్జన్, ఆర్థో సర్జన్, జనరల్ మెడిసిన్, గైనిక్ సర్జన్, ఐ సర్జన్, ఫిజియోథెరపీ కి సంబంధించిన ప్రొఫెసర్ ,అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, మాత్రం అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పెరిగిన రోగుల రద్దీకి కేవలం మెడికల్ కళాశాలలో అభ్యసించే ఎస్ఆర్ వైద్యులు, మెడికో విద్యార్థులు మాత్రమే రోగులకు సేవలు అందిస్తున్నారు. నిజానికి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గత కొన్ని సంవత్సరాలుగా రెగ్యులర్ వైద్యులు, సిబ్బందిల నియామకాలు మాత్రం జరగడం లేదు . ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి మంత్రులు, డీఎంఈలు, జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, చైర్మన్లు, ఎమ్మెల్సీలు వచ్చి విజిట్ చేసిన ఎలాంటి ప్రయోగం లేదని కింది స్థాయి ఉద్యోగులు భావిస్తున్నారు. రాష్ట్ర, జిల్లా ప్రజా ప్రతినిధులు వస్తున్నారే తప్ప ఏ ఒక్కరు కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ప్రధానమైన సమస్యలు పరిష్కరించడంలో ముందుకు రాకపోవడం చాలా బాధాకరంగా ఉందని ఎస్సార్ వైద్యులు, మెడికో విద్యార్థులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అన్ని విభాగాలకు సంబంధించిన వైద్యులు , సిబ్బందిని ఎందుకు నియామకం చెప్పడం లేదని ఆస్పత్రులోని సూపరిండెంట్ తో పాటు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ వారికి ఎవరైనా ప్రశ్నిస్తే తమ చేతిలో ఏం లేదని, గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రభుత్వ వైద్యులు, సిబ్బందిని నియామకాలు చేపట్టాలని పలుమార్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, తో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అభివృద్ధి చైర్మన్, ఎంపీ ,ఎమ్మెల్యే ఎమ్మెల్సీల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా ఏకంగా ఉద్యోగ నియామకాల నివేదిక పత్రాలను అందజేయడం జరిగిందని ఆసుపత్రి వర్గాల అధికారులు రోగి బంధువులకు సమాధానాలు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారు. నిజానికి నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఎంతో ఆశతో వచ్చిన రోగులకు మాత్రం నిరాశే ఎదురు అవుతుందని రోగి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని మాసాలుగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గుండె వ్యాధికి సంబంధించిన వైద్యులు అందుబాటులోకి లేకపోవడంతో తప్పని పరిస్థితిలో హుటాహుటిన ప్రైవేటు ఆసుపత్రులకు రోగులు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, మరి కొందరికి అయితే గుండె జబ్బుకు సంబంధించిన వైద్యుడు అందుబాటులో లేకపోవ డం వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రోగి బంధువులు వైద్య అధికారులపై మండిప డుతున్నారు. అదేవిధంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆధునిక శాస్త్ర చికిత్సలు చేస్తున్నమని ఆస్పత్రి వైద్యులు గొప్పగా చెప్పుకుంటున్నారు. తప్ప అరుదైన శస్త్రల చికిత్సలకు సంబంధించిన ప్రత్యేక వైద్యులు పరికరాలు అందుబాటులోకి లేకపోవడం వల్ల హుటాహుటిన హైదరా బాద్ కు పరుగులు తీయాల్సి వస్తుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇం తటి వైద్య పరంగా ఇబ్బందులు ఎదురైనప్పటికీ ఒకవైపు వైద్యులు మరోవైపు వైద్య సిబ్బంది ల నియామకాలు చేపట్టకపోవడం వల్ల సకాలంలో వైద్య అందక ప్రాణాలు గాలిలోకి కలిసిపోతున్నాయి. అంతేకాకుండా వివిధ విభాగాలకు సంబంధించిన వైద్యులు సకాలంలో వైద్యం అందించకుండా.... రక్తం మీ శరీరంలో చాలా ఇన్ఫెక్షన్ ఉంది.. కొన్ని రోజులు ఆంటీబయాటిక్ మందులు, ఇంజక్షన్లు వాడాల్సి ఉంటుందని సలహాలు సూచనలు రోగులకు తెలియజేస్తూ శస్త్ర చికిత్సలు చేయకుండా తిరిగి వారి వారి ఇంటికి చీటీలపై మందులు రాసి పంపిస్తున్నారనీ రోగి బంధువులు ఆరోపిస్తున్నారు. ఎవరైనా రోగులుగాని రోగి బంధువులు కానీ ఖచ్చితంగా ఇప్పుడే మా రోగికి శస్త్ర చికిత్సలు ప్రాణాలు కాపాడాలని పాదయాపడితే రోగితో పాటు రోగి బంధువులకు ఏదో వంక చూపిస్తూ మీరు అనుకున్నట్లు ఇప్పుడే శస్త్ర చికిత్స చేస్తే రోగి ప్రాణాలు కోల్పోయే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని భయాందోళన గురి చేస్తున్నారనీ రోగులు రోగి బంధువులు వారి బాధని తట్టుకోలేక ఇటు వైద్యులను మరోవైపు బంధువులను ఏమీ అనలేక ప్రైవేట్ ఆస్పత్రికి పరుగులు తీస్తూ అప్పు , సప్పు చేసి లక్షల రూపాయలు పెట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స కోసం వెళ్ళిన రోగాలను ఆసరాగా తీసుకొని ఈ శస్త్ర చికిత్సకు ఇన్ని వేల రూపాయల నుంచి లక్షల రూపాయల వరకు ఖర్చవుతుందని, శస్త్ర చికిత్స ఇప్పుడు చేసుకోకపోతే ప్రాణాపాయం జరుగుతుందని ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు, యజమాన్యాలు, సిబ్బంది భయాందోళనకు గురి చేస్తున్నారనీ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంతటి తతంగం జరుగుతున్నప్పటికీ రోగుల సమస్యలు, ఇబ్బందులను పరిష్కరించే నాథులే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రతిరోజు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి మెరుగైన వైద్యం వైద్య సేవలు కోసం వేల సంఖ్యలో వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడే విధంగా రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్లు, ఎంపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అభివృద్ధి కమిటీ చైర్మన్ లు తోపాటు సంబంధించిన ఆసుపత్రి సూపరిండెంట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లు ఎక్కడ నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే ప్రభుత్వ వైద్యులు వైద్య సిబ్బందిని నియామకలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, రోగులు, రోగి బంధువులు జిల్లా ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు,, వైద్య సిబ్బందిని నియామకల్లు చెయ్యనియెడల జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్య సేవలపై ప్రజలకు పూర్తిగా విశ్వాసం కోల్పోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు భావిస్తున్నారు.

